

కొత్తపేటలో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు క్రీడా జ్యోతిని వెలిగించి కబడ్డీ కోర్టును ఆయన ప్రారంభించారు. కబడ్డి ఈవెంట్లో నాలుగు మండలలకు చెందిన మహిళలు, పురుషులు క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజ్, ఎంపిపి మార్గం గంగాధర్,జెడ్పిటిసి సభ్యురాలు గూడపాటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి

టిక్కెట్ల కోసం నేతల క్యూ

టిడిపి, జనసేన పార్టీల్లో ఒత్తిడి




ప్రజాశక్తి-రామచంద్రపురం

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆయా పార్టీలకు టిక్కెట్లు ఆశించే నాయకులు క్యూ కడుతున్నారు. దీనితో పార్టీలకు ఒత్తిడి రోజురోజుకు పెరుగుతోంది. రామచంద్రపురం నియోజకవర్గంలో ఇప్పటికే వైసిపి ముందుగా ఇన్చార్జిని ప్రకటించడంతో ఆ పార్టీ కార్యకర్తలలో అనుమానాలకు తెరదించినట్లు అయింది. ఇక్కడ మంత్రి వేణు ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ టిక్కెట్ కోసం పోటీ పడగా చివరికి బోస్ తనయుడు పిల్లి సూర్య ప్రకాష్‌ను ఇన్చార్జిగా ప్రకటించడంతో వైసీపీలో అంతర్గత యుద్ధం సద్దుమణిగింది. అయితే టిడిపిలో సీట్లు ఆశించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది ఇది అధిష్టానానికి తలనొప్పిగా తయారైంది. రామచంద్రపురం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో ఓటమి చవి చూసిన తోట త్రిమూర్తులు ఆ పార్టీని వదిలి వైసిపిలో చేరడంతో ఇక్కడ టిడిపి ఇన్చార్జిగా మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యాన్ని పార్టీ ఇంచార్జిగా నియమించారు. అప్పటినుంచి సుబ్రహ్మణ్యం తనదైన శైలిలో పార్టీని నడుపు కొస్తున్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆ పార్టీ ఎంఎల్ఎ సీట్లు ఆశించే అభ్యర్థుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. కాకినాడకు చెందిన డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు తెలుగుదేశం పార్టీలో పనిచేస్తూ రామచంద్రపురం వేదికగా అనేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ సుఖీభవ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ఆయన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో టచ్‌లో ఉంటూ రామచంద్రపురం తెలుగుదేశం టికెట్ లేదా కాకినాడ రూరల్ టిక్కెట్లు ఆశిస్తున్నారు.

ఇటీవల మరో వర్గం పామర్రుకు చెందిన సత్య స్కాన్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణను టిడిపిలో చేర్పించి చంద్రబాబు సమక్షంలో ఆయనకు టిక్కెట్ ఇవ్వాలని రామచంద్రపురం స్థానిక నేతలు పలువురు బాబు దష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు వెంకటరమణ అనుకూల వర్గం తెలియజేస్తున్నారు. ఇక ఇదే సమయంలో కె.గంగవరం మండలం కోటిపల్లి గ్రామానికి చెందిన రాజకీయ నాయకుడు కాంట్రాక్టర్ పప్పుల మసేను వెంకన్న అలియాస్ రేవు శ్రీను టిడిపి టిక్కెట్ ఆశిస్తున్నట్లు సమాచారం. వీరితోపాటు పార్టీలో కొనసాగుతున్న పెంకే సాంబశివరావు, చింతపల్లి అర్జున్‌లు కూడా టిడిపి టిక్కెట్ ఆశిస్తున్నారు. వీరితోపాటు మైనార్టీ సంఘం నాయకులు కలిసి తనకు టిక్కెట్ కేటాయించాలని అభ్యర్థించినట్లు పత్రికలకు వార్తలు వెలువడ్డాయి.



రెడ్డి సుబ్రహ్మణం, టిడిపి



చప్పిడి వెంకటేశ్వరరావు,టిడిపి



పోలిశెట్టి చంద్రశేఖర్, జనసేన

రామచంద్రపురానికి చెందిన మున్సిపల్ కార్పొరేటర్ రాజకీయ నాయకులు మేడిశెట్టి శేషారావు సైతం టిడిపి టిక్కెట్ ఆశిస్తున్నారు. దీంతో సుమారు పదిమంది వరకు టిడిపి టిక్కెట్ ఆశించడంతో పార్టీ అధిష్ఠానం గందరగోళం ఏర్పడే పరిస్థితి నెలకొంది. జనసేన పార్టీలోనూ ఆశావహుల జాబితా రోజురోజుకీ పెరుగుతోంది. ఇక్కడ ఇన్చార్జిగా పోలిశెట్టి చంద్రశేఖర్ గత ఐదేళ్లగా కొనసాగుతూ పార్టీలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒకవేళ పొత్తులో భాగంగా ఈ సీటు జనసేనకు లభిస్తే పోలిశెట్టి చంద్రశేఖర్‌తో పాటు కాజులూరు మండలం చెందిన చిక్కాల దొరబాబు జనసేన టికెట్ ఆశిస్తున్నారు. ఇప్పటికే ఆయన రామచంద్రపురంలో కార్యాలయం ఏర్పాటు చేసుకుని పావులు కదుపుతూ టిక్కెట్ కోసం తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మొత్తం జనసేన, టిడిపి రోజురోజుకీ పార్టీ టిక్కెట్ల కోసం పెరుగుతున్న ఒత్తిడితో అధిష్టానాలు తీవ్ర ఒత్తిడి లోనవుతున్నాయి. ఎన్నికలు మరో మూడు నెలల మాత్రమే ఉండడంతో అభ్యర్థులు ఎంపికలో పార్టీలు ముమ్మరంగా కసరత్తులు ప్రారంభించాయి. చివరికి టికెట్ ఎవరికి వస్తుందో అనేది అంతుచిక్కని ప్రశ్నగా తయారయింది. దీనిపై నియోజకవర్గ స్థాయిలో ప్రజలంతా టిక్కెట్ ఎవరికనేది చర్చించుకుంటున్నారు

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-అమలాపురం

మహిళా సాధికారతే వైసిపి ప్రభుత్వం లక్ష్యమనిరాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ వెల్లడించారు. మంగళవారం జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైయస్సార్ ఆసరా పొదుపు సంఘాల అక్కా చెల్లెళ్లకు బాసట కార్యక్రమంలో భాగంగా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెప్మా ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్ స్టాల్‌ను మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా ఆహా క్యాంటీన్ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాలుగో విడత కింద లబ్ధిదారులకు 6343 మందికి రూ.5 కోట్ల 20 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి కూడుపూడి సూర్యనారాయణ రావు, అమలాపురం పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, మున్సిపల్ కమిషనర్ విఐపి నాయుడు, మెక్మా పీడీ ప్రియంవద తో పాటు అమలాపురం పట్టణంలోని మహిళా పొదుపు సంఘాల సభ్యురాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు అందజేస్తున్న విశ్వరూప్

ఆసరా చెక్కుల పంపిణీ

కాట్రేనికోన : ముమ్మిడివరం నియోజకవర్గం లో ఇప్పటి వరకు వివిధ పథకాలు ద్వారా సుమారు రూ. రెండు వేల కోట్లు వైసిపి ప్రభుత్వం పంపిణీ చేయడం జరిగిందని ఎంఎల్‌శ్రీ పొన్నాడ సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం మండలం ఎంపిడిఒ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాట్రేనికోన మండలంలో 1347 స్వయం సహాయక సంఘాలలోని 13,477 మంది సభ్యులు కు రూ.8 కోట్ల 99 లక్షల 40 వేల 82 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టిటిడి ధర్మకర్త యానాదయ్య, కాశి బాల మునికుమారి, ఏడిద చక్రం, జెడ్పిటిసి సభ్యుడు నేల కిషోర్, ఎంపిపి పాలపు లక్ష్మి ధర్మారావు తదితరులు పాల్నొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

రావులపాలెం రాష్ట్రాభివృద్ధిని, సిఎం జగన్ పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రభుత్వం పై ఆరోపణలు చేస్తున్నాయని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం రావులపాలెంలో జరిగిన సభలో వైఎస్ఆర్ ఆసరా నాల్గో విడత పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో రావులపాలెం జెడ్పిటిసి సభ్యుడు కుడుపూడి శ్రీనివాస్, ఎంపిపి కర్రి లక్ష్మీ నాగదేవి, వీర్రెడ్డి, రావులపాలెం సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, సాకా ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని యుటిఎఫ్ పోరుబాటు

ప్రజాశక్తి-అమలాపురం

ఉద్యోగ,ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ చేపట్టిన పోరుబాట కొనసాగింపుగా బుధవారం జిల్లా కేంద్రం అమలాపురంలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ బైక్ ర్యాలీ అమలాపురం యుటిఎఫ్ హోమ్ నుంచి బయలుదేరి గడియారం సెంటర్ మీదుగా వెంకటేశ్వర స్వామి గుడి, ఆర్‌డిఒ కార్యాలయం ఎమ్మార్వో కార్యాలయం, నల్ల వంతెన, కలెక్టర్ కార్యాలయం వరకు సుమారు 100 బైకులతో 200 మంది కార్యకర్తలతో నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతి బసు, జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం టివి.సుబ్బారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు భేతినేడి శ్రీనివాస్, కోశాధికారి కేశవరావు, జిల్లా కార్యదర్శులు జివి.రమణ, పి.మురుగేశ్వరరావు, బాలాజీ, మురళి, పి.శ్రీనివాసరావు, చంద్రకళ, కె.శ్రీనివాసరావు, వి.రత్నం పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ ఉపాధ్యాయులు

పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాలరాజు

ప్రజాశక్తి-అంబాజీపేట

ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్ నుంచి బుధవారం నియామక పత్రం వచ్చిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతాకుమారి తెలిపారు. మంగళగిరిలో సర్పంచుల రాష్ట్రస్థాయి సమావేశం విజయవంతం చేసిన కృషి, ప్రజాసమస్యలపై సర్వసభ్య సమావేశాలోఅధికారుల దృష్టికి తీసుకెళ్ళడం, గ్రామ సమస్యలపై దృష్టి సారించినందుకు ఈ పదవి వరించిందిని బాలరాజు తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి, కార్యదర్శి రంబాల రమేష్ తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీరాజ్ ప్రజా ప్రతినిధులు వాణిగా ఉద్యమిం చేందుకు సర్పంచు లను భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న సర్పంచ్ బాలరాజు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

జగనన్న ఆరోగ్య సురక్షతో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-మండపేట

ప్రజలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలని లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టామని, పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2వ దశ కార్యక్రమాన్ని ఛైర్ పర్సన్ రాణి, కౌన్సిలర్లు పోతంశెట్టి ప్రసాద్, చిట్టూరి సతీష్ లతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఈ కార్యక్రమం సచివాలయాల వారీగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డా.రమ్య లక్ష్మీ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలపురం (అల్లవరం)

అల్లవరం మండలం ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ 2024 సంవత్సరం క్యాలెండర్‌ని ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దళితుడు విజయవాడలో అంబేద్కర్ స్మతి వనాన్ని సందర్శించలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పే నరసింహారావు, జి.లోవరాజు, ఎం.రాజేష్, బి.నకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, చీరల పంపిణీ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రోల్లపాలెం నేదునూరి నతానియేలు బుధవారం ఆయన నివాసం వద్ద నిరుపేదలకు 300 దుప్పట్లు, 200 చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నథానియేలు, ఆయన భార్య ఎంపిటిసి సభ్యురాలు నాగరత్నం మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి టిడిపికి సేవలు అందిస్తున్నామని అన్నారు. పి.గన్నవరం నియోజవర్గం టిడిపి ఎంఎల్ఎ టిక్కెట్ పోటీ చేయాలని ఆశిస్తున్నట్లు నథాని యేసులు తెలిపారు. ఇప్పటికైనా పార్టీ గుర్తించి మాదిగలకు పి.గన్నవరం నియోజవర్గం టిక్కెట్టు ఇవ్వాలని పార్టీని కోరారు. పి.గన్నవరం నియోజకవర్గంలో మాదిగలు సుమారు 27,000 నుంచి 28,000 ఉండటం వల్ల ప్రాధాన్యత ఇవ్వాలని టిడిపి నాయకులను కోరారు.



పంపిణీ చేస్తున్న నతానియేలు దంపతులు

రామచంద్రపురం ఎస్ఐగా సురేష్ బాబు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం ఎస్ఐగా డి.సురేష్ బాబు నియమితులయ్యారు. అయినవిల్లి నుంచి ఆయన రామ చంద్రపురం బదిలీ అయ్యారు. ఆయన గురువారం నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు రామచం ద్రపు రంలో పని చేసిన డి.సురేష్ ముమ్మిడివరం బదిలీపై వెళ్లారు.

అమలాపురం తాలూకా ఎస్ఐగా శేఖర్ బాబు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం తాలూకా ఎస్ఐగా శేఖర్ బాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసిన పరదేశి అంగర పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు. విజయవాడ నుంచి వచ్చిన శేఖర్ బాబు అమలాపురం తాలూకా ఎస్ఐ గా నియమితులయ్యారు.



విద్యార్థినులను సత్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

జిల్లాలో బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు పాల్గొని బాలికా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో బాల బాలికలకు మెమెంటోస్ ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు మెమెంటోస్ అందజేశారు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **మండపేట** స్థానిక సంగమేశ్వర కాలనీలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ముత్యాల మాణిక్యమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **మామిడికుదురు** దీప్తి స్కూల్ లో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహింసారు. విద్యార్థినులందరు సేవ్ గర్ల్స్ నమూనాలో కూర్చొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డివివి.సత్యనారాయణ అన్నారు. **కపిలేశ్వరపురం** జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఆలమూరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని మాచర ఉన్నత పాఠశాల , కేదార్లంక ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు రమాదేవి ,ఎం ప్రసాద్,లు అధ్యక్షతన జరిగిన బాలికల అవగాహన సదస్సు జరిగాయి. శ్రమ సంస్థ కోఆర్డినేటర్ ఈశ్వరి పాల్గొన్ని మాట్లాడారు.

సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.60 లక్షల మంజూరు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని సుందరపల్లి గ్రామంలో గల సోమేశ్వర స్వామి వారి ఆలయ అభివద్ధికి ప్రభుత్వ నిధులు రూ.60 లక్షలు మంజూరయ్యాయని వైసిపి ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాష్ తెలిపారు. ఆయన బుధవారం సుందరపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో అన్ని గ్రామాల అభివద్ధికి కృషి చేస్తామన్నారు. సిఎం జగన్ సహకారంతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు ఈ సందర్భంగా ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎం పిటిసి, జెడ్పిటిసి సభ్యులు, పార్టీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

పలుచోట్ల విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జిల్లాలో పలుచోట్ల ట్యాబ్‌లను బుధవారం పంపిణీచేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

మామిడికుదురు పి.గన్నవరం హైస్కూల్ నందు 8 వ తరగతి విద్యార్థులకు రెండవ విడత ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్ లను పి.గన్నవరం నియో జకవర్గ వైసిపి ఇంచార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం ప్రసాద్, ఎంఈఓ-1 కోన హెలీనా, ఎంఈఓ-2 సిహెచ్. వీరభద్రానందం, మరియు ఉపాధ్యాయులు వైఎస్ఆర్ సిపి నాయకులు పాల్గొన్నారు. **మండపేట** మండలంలో ద్వారపూడి గ్రామంల 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ ల ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పంపిణీచేశారు. ఆయన మాట్లా డుతూ సిఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు, సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఎంపిపి ఉండమట్ల వాసు, ఎంపిటిసి సభ్యుడు నాయుడు, ఎంఇఒ నాయుడు రామచంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** మండలంలోని హసనబాద జెడ్ పి పి హైస్కూల్లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ పాల్గొని విద్యార్థులకు మంజూరైన ట్యాబ్లు, బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ నాగేశ్వరి, శ్రీనివాస్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పిఎస్‌బిఎస్‌కె.సుందరి , గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్ లు పంపిణీ చేస్తున్న పిల్లి సూర్యప్రకాష్



ట్యాబ్ లు పంపిణీ చేస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు

నవాబుపేటలో 'బాబు ష్యూరిటీ '

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని నవాబుపేటలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం జరిగింది. కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ బండారు సత్యానందరావు పాల్గొని మాట్లాడుతూ జగన్ నాలుగున్నర యేళ్ళ పాలనలో దళిత వాడలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఆరోపించారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కొత్తపేట వాడపాలెం టిడిపి కార్యాలయం నందు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బండారు సత్యానందరావు మాట్లాడారు. వైఎస్ జగన్ సిఎం అయ్యాకా డ్వాక్రాను అధోగతి పాలుచేసి రూ.2 వేల కోట్లకు పైగా వున్న అభయహస్తం సొమ్మును దారి మళ్ళించి మహిళలను మోసం చేశారని విమర్శించారు. మహిళలకు అండగా వుండేది ఎప్పటికీ టిడిపియేనని అన్నారు. కార్యక్రమంలో ముత్యాల బాబ్జి, రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల ఏర్పాటు ఘనత చంద్రబాబుదే

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత మాజీ సిఎం చంద్రబాబుకి దక్కుతుందని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గొల్లవిల్లిలో బుధవారం టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆనందరావు మాట్లాడారు. రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉంటే 79 లక్షల మందికి మాత్రమే ఆసరా ఇస్తూ సిఎం జగన్ గొప్పలు చెప్పుకుంటూ 75 శాతం మందికి మొండి చేయి చూపుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి దేశంశెట్టి లక్ష్మీనారాయణ, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసుబాబు తదితరులు ఉన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

'వాడపల్లి' వెంకన్న హుండీ ఆదాయం రూ.కోటి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మందపల్లి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మరియు పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకమ్మ అన్నదాన సత్రం ఇఒ ఎం.రాధాకష్ణ పర్యవేక్షణలో ఆలయ ముఖ మండపంలో 35 రోజులు కాలానికి హుండీలను లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.1 కోటి 2 లక్షల 78 వేల 663తో పాటు 11 గ్రాముల బంగారం, 739 గ్రాముల వెండి వివిధ దేశాల కరెన్సీ వచ్చింది. లయ ప్రాంగణంలో ఉన్న విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీ ఆదాయం రూ.2 లక్షల 54 వేల 454 సమకూరయని ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు తెలిపారు ఈ కార్యక్రమంలో ధర్మకర్త మండల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు

సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

ఈనెల 28న రాజమహేంద్రవరం ఈ నెల 28న నిర్వహించనున్న పాత పెన్షన్ సాధన సభను జయప్రదం చేయాలని సమగ్ర శిక్ష జెఎసి అధ్యక్షులు సిహెచ్ వెంకన్నబాబు పిలుపునిచ్చారు. బుధవారం అమలాపురం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కోనసీమ సమగ్ర శిక్ష జెఎసి నాయకులు సమావేశం నిర్వహించారు. సభకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు.

కార్టూ'నిజం'




'పొన్నాడ' జీవితం స్ఫూర్తిదాయకం : డాక్టర్ సీతారామారావు

ప్రజాశక్తి-రాజోలు

సీనియర్ న్యాయవాది, గాంధేయవాది పొన్నాడ హనుమంతరావు జీవితం స్ఫూర్తిదాయకమని ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ కె.సీతారామారావు అన్నారు. బుధవారం రాజోలులో గాంధీ హౌస్‌లోని హనుమంతరావు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన హనుమంతురావు కాంస్య విగ్రహన్ని, పొదలాడకు చెందిన కవి, కథకుడు, జీవిత చరిత్రకారుడు ఎంఎస్ సూర్యనారాయణ రచించిన 'జ్ఞాన గుణవంతా..జయ హనుమంతా..పొన్నాడ జీవన ప్రస్థానం' పుస్తకాన్ని డాక్టర్ సీతారామారావు ఆవిష్కరించారు. న్యాయవాది వాడ్రేవు పాపాయి పంతులు అధ్యక్షతన హనుమంతురావు ప్రథమ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సీతారామారావు మాట్లాడుతూ హనుమంతరావు అరవై ఏళ్ల పాటు న్యాయవాద వృత్తిలో సేవలందించిన ఆయన అనేక చట్టాలను సామాన్యులకు అర్థమయ్యే రీతిలో తెలుగులో అనువాదం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీకి విధేయు డిగా ఉంటూ రాజోలు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన పోటీ చేశారన్నారు. రాజోలు సర్పంచ్‌గా పలు కాలనీల్లో ఇళ్ల స్థలాలను ఉచితంగా అందజేశారని అన్నారు. హనుమంతరావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన కుమారులు పొన్నాడ సూర్యప్రకాష్, సూర్యరావులను పలువురు అభినందించారు. రాజోలు పుర ప్రముఖులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు హనుమంతరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ వాడ్రేవు పాపయ్య పంతులు, పొన్నాడ సూర్యారావు, పొన్నాడ సూర్యప్రకాశ్, పొన్నాడ ఎస్ఆర్‌వివి.సూర్యారావు, పిసిసి సభ్యుడు రుద్రరాజు గోపాలకష్ణంరాజు పలువురు పాల్గొన్నారు.



'పొన్నాడ' జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు



'పొన్నాడ' విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు తదితరులు

నేరాలు ఘోరాలు

బీచ్‌కు కొట్టుకొచ్చిన యువతి మృతదేహం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్‌టిఆర్ బీచ్‌కు బుధవారం ఒక యువతి మృతదేహం కొట్టుకొచ్చింది. మృతదేహం వద్ద లభించిన ఐడి కార్డ్ ఆధారంగా కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న శ్వేతగా పోలీసులు గుర్తించారు. అయితే ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగిందా లేక ఆత్మహత్యనా లేక హత్య అనే విషయాలు విచారణలో తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జి జి హెచ్‌కు తరలించారు.

బ్యాంకు మేనేజర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం మొబర్లీపేట స్టేట్ బ్యాంక్ మేనేజర్ కెవిఎస్‌బిఆర్.వర్మ, అసిస్టెంట్ మేనేజర్ ఎఎల్‌టి సుందరీలపై పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కుడుపూడి అశోక్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. అశోక్ బ్యాంకు లావాదేవీల సమయంలో తన భార్య ఎకౌంటును క్లోజ్ చేయమని అడిగినప్పటికీ వారు చేయలేదని, సిబ్బందిని అడగడానికి తన భార్యతో కలిసి వెళ్లిన సమయంలో వెకిలి గా నవ్వుతూ ఇబ్బందులకు గురి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను హార్ట్ ఆపరేషన్ చేయించుకున్నానని తొందరగా తన పనిని చేయమని అడిగినప్పటికీ బ్యాంకు మేనేజర్ నిర్లక్ష్య సమాధానం చెబుతూ తనను ఇబ్బందులు పాలు చేశారని పేర్కొన్నారు. తాను 25 సంవత్సరాలుగా న్యాయవాది వత్తిలో అమలాపురం, జిల్లా, హైకోర్టులలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నానని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్ ఎగ్జిక్యూటివ్ మేంబర్ పనిచేస్తున్నానని తెలిపారు. తన పరువుకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించడంతో బ్యాంకు మేనేజర్ వర్మ అసిస్టెంట్ మేనేజర్ల సుందరీల పై పరువు నష్టం కేసు సంబంధించి నోటీసు అందజేశాననిఅన్నారు. అలాగే అతనిపై చర్యలు తీసుకోవాలని అంబెడ్స్ మెన్ (రిజర్వ్ ఆ ఫ్ ఇండియా. హైదరాబాద్) కు ఫిర్యాదు చేశానని అలాగే అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు పెట్టాననిఅశోక్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురులో వివాహిత మెండా సుజాత(29) కడుపు నొప్పి తాళలేక బుధవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుందని ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. తాపీ పని చేసుకుంటూ జీవనం సాగించే భర్త వెంకటేశ్వ్రరావు ఉదయం బయటకు వెళ్లిన తరువాత ఈ సంఘటన జరిగింది. ఈ విషయాన్ని భర్తకు ఫోన్ చేసి తెలపగా అతను వచ్చి ఆమెను కిందకు దింపి పేరూరు వైజంక్షన్ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మతి చెందిందని వైద్యులు ధ్రువీ కరించారు యానాం సమీపంలో మల్లవరంకి చెందిన సుజాతతో మామిడికుదురు వాసి మెండా వెంకటేశ్వరరావుతో 6 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మతు రాలు తల్లి గంగి రెడ్డి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మత దేహాన్ని పోస్ట్ మార్టం కొరకు రాజోలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

గుండెపోటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆత్రేయపురం రజక పేటకు చెందిన కాకరపర్తి నూకాలు(55) బుధవారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో ఆమె గుండెపోటుతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు 108 కి సమాచారం అందించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందింది. ఆమెకు భర్త లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తోంది.

ఆభరణాలు స్వాధీనం దొంగ అరెస్టు

ప్రజాశక్తి-కడియం

కడియపులంకలో ఈ నెల 22న పుల్లా పెద్దసత్యనారాయణ ఇంట్లో 20.5 కాసుల 9 బంగారు ఆభరణాలు చోరీ కేసులో నిందితుని అరెస్టు చేసినట్లు కడియం పోలీసులు తెలిపారు. సిఐ తిలక్ వివరాలు వెల్లడించారు. పెదసత్యనారాయణ ఇంట్లో 20 ఏళ్లుగా పని చేస్తున్న పల్లా బాబీ రెండేళ్ల నుంచి ఇంట్లో తొమ్మిది బంగారు ఆభరణాలను పలుమార్లు చోరీ చేసినట్టు తెలిపారు. వాటిలో ఒక బ్రాస్లెట్, ఒక నల్లపూసల తాడు ఉంచుకుని మిగిలిన ఏడు బంగారు వస్తువులు వివిధ బ్యాంకుల్లో తాకట్టు పెట్టినట్లు తెలిపారు. నిందితుని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఆభరణాలు స్వాధీన పరుచుకున్నట్టు వెల్లడించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

పెద్దేవంలో సుగంధి చెరువులో ఈ నెల 20న ప్రమాదవశాత్తు పడిపోయిన వివాహితుడు మృతి చెందాడని తాళ్లపూడి ఎస్క్మి కెవి రమణ తెలిపారు. పెద్దేవం గ్రామానికి చెందిన చిక్కాల గణేష్ (40) ఈ నెల 20న బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసినట్టు ఎస్ఐ కెవి.రమణ తెలిపారు. బుధవారం ఉదయం చెరువులో మృతదేహం కనబడడంతో పోలీసులు గణేష్‌దిగా గురించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్క్మి రమణ తెలిపారు.

ఓటరు జాబితాలో 10 శాతం బినామీలు

ప్రజాశక్తి - కాకినాడ

ఓటరు జాబితాల్లో నివాసం లేని బినామీ ఓటర్లు అధికంగా ఉన్నారని కాకినాడ పౌర సంక్షేమ సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఓ ప్రకటనను విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రత్యక్ష పరిశీలనలో ఇంటింటికీ వెళ్లి ఓటరును గుర్తించే నిర్ధారణ లేకుండా జాబితాను రూపొందడం వలన పది శాతం డమ్మీ సంఖ్య ప్రతి పోలింగ్ బూత్‌లోనూ ఉందన్నారు. ఆధార్ అనుసంధానం ఓటరు జాబితాకు ప్రవేశ పెట్టకపోవడం వలన అవకతవకలు షరా మామూలుగా ఉండడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల కమిషన్ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆధార్ అనుసంధానం చేపట్టే సంస్కరణలు చేపట్టాలన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్ల నమోదుకు నూరు శాతం అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు.

యానాం వార్తలు

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి - యానాం


విద్యార్థికి బ్యాడ్జీలు పెడుతున్న హెచ్ఎం

స్థానిక కమలా నెహ్రూ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కెఎన్.లక్ష్మీ అధ్యక్షతన జాతీయ బాలిక దినోత్సవాన్ని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక యానాం కమిటీ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు మాట్లాడుతూ ఆడపిల్ల సమాజానికే గర్వకారణమని, బాలికలు అందరూ ఇష్టపడి చదివి, ప్రభుత్వ అవకాశాలను ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా ఆడపిల్ల దేశానికి గర్వకారణం అనే స్టిక్కర్‌ను ఆవిష్కరించారు. 'ఐ యాం నేషన్స్ ప్రైడ్' అనే బ్యాడ్జీలను విద్యార్థినీలకు అలంకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జెవివి.నాయకుడు కెవివి సత్యనారాయణ, గిరిజాదేవి, విపిఎస్ఎం.మంజరి పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జనవరి 25 గురువారం నిర్వహిస్తున్నట్లు రీజనల్ అడ్మినిస్ట్రేటర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆర్.మునిస్వామి బుధవారం తెలిపారు. స్థానిక డాక్టర్ ఎస్ఆఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ సూపర్వైజర్లు, నోడల్ అధికారులు, ఎలక్టోరల్ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

స్టాండింగ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం

ప్రజాశక్తి - యానాం


సమావేశంలో మాట్లాడుతున్న మునిస్వామి

2024 సార్వత్రిక ఎన్నికల నియామవళికి అనుగుణంగా పనిచేసేలా స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పరిపాలన నాధికారి కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో పరిపాలనాధికారి మునిస్వామి బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రకటనతో మోడల్ కోడ్ అఫ్ కాండక్ట్ అమల్లోకి రానుందని తెలిపారు. మోడల్ ప్రవర్తన నియమావళి పూర్తిగా అనుగుణంగా ఉండేలా యానాం అసెంబ్లీ సెగ్మెంట్ స్థాయిలో స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ స్టాండింగ్ కమిటీలో యానాం ఎస్‌పితోపాటు, గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉండాలని నిర్ణయించారు.

ఫైనల్ రిహార్సల్స్

ప్రజాశక్తి - యానాం


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో ఎస్‌పి రఘునాయగం, సిఐ షణ్ముగం, ఎస్ఐలు శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వుల వీరభద్ర స్వామి ఆధ్వర్యంలో పోలీసులు కవాతు ఫైనల్ రిహార్సల్స్ నిర్వహించారు. పుదుచ్చేరి పోలీస్, ఇండియన్ రిజర్వ్ బెటాలియన్, హోంగార్డ్స్ కవాతు నిర్వహించారు. కవాతు రిహార్సల్స్, గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలను ఎస్‌పి పర్యవేక్షించారు.

తాడికోనలో నూరు శాతం కుల గణన సర్వే

ప్రజాశక్తి-అమలాపురం

అల్లవరం మండలం తాడికోన సచివాలయం లో సిబ్బంది, వాలంటీర్స్ ప్రస్తుతం నిర్వహిస్తున్న కుల సర్వే లో జిల్లాలోనే ప్రథమంగా 100శాతం పూర్తి చేశారని ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ బుధవారం తెలిపారు. 547 కుటుంబాల వివరాలు యాప్ లో నమోదు చేశారని నూరు శాతం లక్ష్యం జిల్లాలో మొదట సాధించిన సచివాలయంగా నిలిచిన తాడికోన కార్యదర్శులు రాజా, వీరబాబు సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ ను వత్తి పట్ల వారి అంకిత భావం ను గుర్తించి ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ వారికి అభినందనలు తెలిపి చిరు కానుకలు అందజేశారు. కార్యక్రమంలో ఎఒ బి.లక్ష్మణరావు, కార్యదర్శులు రాజా, వీరబాబు తాడికోన సచివాలయం సిబ్బంది వాలంటీర్స్ పాల్గొన్నారు.

కూళ్లలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కూళ్ల గ్రామంలో పామర్రు పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ చిల్లె నాగేశ్వరరావు ఈ పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 180 పశువులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె. వెంకటరావు, పామర్రు పశు వైద్యులు ఎం.బిందు, పేకేరు పశు వైద్యులు సురేష్ బాబు, పాల్గొన్నారు. మొత్తం 42 మంది పాడిరైతులు కార్యక్రమానికి హాజరయ్యారు.

పాఠశాలకు మెగాఫోన్ బహూకరణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కోటిపల్లి ఎంపిపి పాఠశాలకు 5 వతరగతి చదువుతున్న విద్యార్థి గాలి హర్షవర్ధన్ తల్లిదండ్రులు గాలి బాలాజీ, దుర్గాదేవిలు రూ.15 వేలు విలువైన మెగాఫోన్ బుధవారం బహూకరించారు. పాఠశాలలో జరిగే పలు కార్యక్రమాలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఈ మెగాఫోన్‌ను బహూకరించినట్లు పాఠశాల హెచ్ఎం కెఆర్‌కె.ప్రసాద్ తెలిపారు. మెగా ఫోన్ బహూకరించినందుకు వారికి పాఠశాల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపిఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మండపేట

న్యూ ఢిల్లీ సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిఎస్ విద్యార్థులు 21 బంగారు పతకాలు సాధించి ప్రతిభ కనబరిచారు. బుధవారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యాసంస్థల డైరెక్టర్ వల్లూరి చిన్నారావు మాట్లాడుతూ తమ విద్యార్థులు పతకాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పిఠాపురం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సూర్యవతి

మున్సిపాలిటీలో నెలకున్న సమస్యలపై కౌన్సిల్ సభ్యులు గళమెత్తారు. మున్సిపల్ బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యవతి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభ దశలోనే 12వ వార్డ్ కౌన్సిలర్ బొజ్జ జగదీశ్వరి జగ్గయ్య చెరువులో నత్తనడకన జరుగుతున్న అభివృద్ధి పనులపై నిలదీశారు. అనంతరం 24- 25 సంవత్సరం అంచనా బడ్జెట్ రూ.3254.28 లక్షలుగా భావిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బడ్జెట్ చదువుతుండగా పట్టణంలో అక్రమ కట్టడాలు లేవా వాటిపై ఫైన్ వెయ్యలేదని టిపిఓను బొజ్జ జగదీశ్వరి నిలదీశారు. 13వ వార్డ్ కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వర మాట్లాడుతూ జెసిబి మున్సిపాలిటీ తరపున కొనాలని గతంలో కోరమని ఎందుకు కాలయాపన చేస్తున్నారాని అధికారులను ప్రశ్నించారు. 2వ వార్డ్ కౌన్సిలర్ సోమరౌతు లలితదేవి మాట్లాడుతూ పట్టణంలో పార్కింగ్ ప్లేస్ లేకుండా షాపింగ్ మాల్స్ నిర్మిస్తున్నారని డ్రైనేజీలపై అనధికారికంగా రాళ్ళు వేసి పార్కింగ్ చేస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. టిడిపి ఫ్లోర్ లీడర్ అల్లవరపు నగేష్ మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల నుంచి ఎలక్ట్రికల్ పోల్స్ కోసం అడుగుతున్న పట్టించుకోవడం లేదని విద్యుత్ వైర్లు రోడ్డుపై వేలాడుతున్నాయని, ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని నిలదీశారు. ఎంపీ వంగా గీత విశ్వనాథ్ మాట్లాడుతూ జిజిఎంపి నిధులు త్వరితగతిన వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే పట్టణంలో ఎలక్ట్రికల్ పోల్స్ కు ఎంపి నిధుల నుంచి రూ 20 లక్షలు కేటాయిస్తున్నట్లు ఆమె తెలిపారు. అంబేద్కర్ భవన్ నిర్మాణానికి గతంలో 50 లక్షలు ఇవ్వగా మరో అరవై లక్షలు మౌళిక సదుపాయాల కొరకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా 'కబ్జా' నాటిక

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్


కబ్జా నాటకంలో ఓ సన్నివేశం

ప్రవాసాంధ్ర ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో డివి సత్యనారాయణ స్మారక నాటక పోటీలు పేరుతో బిలాయిలో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించిన నాటక పోటీల్లో వృంగార వల్లభ ఆర్ట్స్ క్రియేషన్స్ సామర్లకోట చెందిన 'కబ్జా' నాటిక ద్వితీయ ఉత్తమ నాటికగా ఎంపికైంది. సామర్లకోట సకల కళా సమాఖ్య గౌరవాధ్యక్షులు, ప్రముఖ రచయిత, దర్శకులు కెబి ఆనంద్ దర్శకత్వంలో, కొంతం కాశీ విశ్వనాథ్ రచనలో రూపొందించిన ఈ నాటిక ఆద్యంతం సభికులను ఆకట్టుకున్నట్టు దర్శకులు ఆనంద్ చెప్పారు. కాగా ఉత్తమ నాటికగా కబ్జా నాటిక బహుమతి సాధించడం పట్ల కళా బృందానికి సామర్లకోట సకల కళా సమాఖ్య అధ్యక్షులు బడుగు సీతారామ రాజు, కోశాధికారి అలమండ ప్రసాద్, నాయకులు కేతినీడి శ్రీనివాసు, కర్రి ప్రభాకర్, కర్రి బాబురావు, కోర్లమండ కొండల రావు, తదితరులు అభినందనలు తెలిపారు.

పైప్‌లైన్ మరమ్మతు పనులు పూర్తి చేయాలి


పైపులైన్ పనుల ప్రగతిని పరిశీలిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

ప్రజాశక్తి - కాకినాడ

సామర్లకోట కెనాల్ నుంచి శశికాంత్ నగర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు ముడినీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాలని నగర కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు ఆదేశించారు. అచ్చంపేట సమీపం లోని ఉండూరు వద్ద పైప్‌లైన్ ధ్వంసం కావడంతో రెండు రోజులుగా కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం కలిగిన నేపథ్యంలో కమిషనర్ అధికారులతో కలిసి అక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను బుధవారం పరిశీలించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పైప్‌లైన్ డామేజ్ కావడం వల్ల శశికాంత్ నగర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పరిధిలోని సుమారు ఎనిమిది డివిజన్ల పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. రమణయ్యపేట, బొందగుంట, కొండేలుపేట, డి- మార్ట్, దుమ్ములపేట, పర్లోపేట, రాజీవ్ గహకల్ప వంటి ప్రాంతాలకు మంచినీటి సరఫరాలో సమస్య తలెత్తిందన్నారు. ఈ కారణంగా ఆయా డివిజన్ల ప్రజలు మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా నగరపాలక సంస్థ వాటర్ వర్క్స్ విభాగం వద్ద అందుబాటులో ఉన్న ఆరు మంచినీటి ట్యాంకర్లతోపాటు మరో 6 అదనపు ట్యాంకర్లను కూడా సమకూర్చి మంచినీటిని సరఫరా చేస్తున్నామన్నారు. పైప్‌లైన్ మరమ్మతు పనులను మరింత వేగవంతంగా చేపట్టి సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎస్ఇ పి.సత్య కుమారి, ఇఇ మాధవి, ఎఇ రమేష్, వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మోతాదుకు మించితే అనారోగ్య సమస్యలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

చిన్న చిన్న రోగాలకు సైతం యాంటీబయాటిక్ మందులు వినియోగించడం వలన పలు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని డాక్టర్ కుమార్ యాదవ్ అన్నారు. బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎడాపెడా యాంటీబయాటిక్స్ వాడటం వలన శరీరంలో ఉపయోగపడే మంచి బ్యాక్టీరియా తొలగి జీర్ణాశయ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. పేగుపూత కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. ఎప్పుడైనా అవసరమైనప్పుడు ఈ మందులు ఉపయోగపడవని అన్నారు. వైద్యుల సూచనల మేరకు యాంటీబయోటిక్స్ వాడాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లాన్ టెన్నిస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కాకినాడ


విజేతలకు బహుమతులు అందచేస్తున్న అతిథులు

ఐదు రోజులుగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరుగుతున్న 67వ జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ టోర్నీమెంట్ బుధవారంతో ముగిసింది. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పాల్గొని మాట్లాడారు. శారీరక మానసిక ఎదుగుదల కు క్రీడలు సహకరిస్తాయిని తెలిపారు. స్పోర్ట్స్ పట్ల, విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి మంచి అభిప్రాయం ఉందన్నారు. విద్యార్థుల పురోగతికి కృషి చేస్తున్నదని వివరించారు. జాతీయస్థాయిలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. జాతీయస్థాయిని చక్కగా నిర్వహించిన అధికారులను ఆయన అభినందించారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.నాగమణి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు చక్కటి ప్రతిభను కనబరిచారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సుబ్బారావు, జెఎన్‌టియు పాలకమండలి సభ్యులు బెజవాడ సత్యనారాయణ, కర్రి భూమి రెడ్డి, పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ జి.భానుమూర్తి, ఉపవిద్యాశాఖాధికారులు ఆర్‌జె.డేనియల్ రాజు, డి.సుభద్ర, డిఎస్‌డిఒ బి.శ్రీనివాస కుమార్, మండల విద్యాశాఖ అధికారులు సిహెచ్.రవి, ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి 'విద్యే' కీలకం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

స్థిరమైన అభివృద్ధి, మానవ హక్కులు, ప్రపంచ శాంతి ఒక్క విద్యుతోనే సాధ్యమని విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు అన్నారు. బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 జనవరి 24 నుంచి ప్రతి ఏటా అంతర్జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. 'శాశ్వత శాంతి కోసం నేర్చుకోవడం' అనే థీమ్ ఈ ఏడాది లక్ష్యమని అన్నారు. విద్య లేకపోతే జ్ఞానం, విలువలు కరువై హింసాత్మక సంఘర్షణలు పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

కాకినాడ సమావేశాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అంబాజీపేట

పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల గురువారం కాకినాడలో నిర్వహించే సమావేశాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పార్టీ శ్రేణులు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పిలుపుచ్చారు. అంబాజీపేటలో మాచవరం శివన్నారాయణ ఇంటి వద్ద బుధవారం పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ వంటెద్దు బాబి అధ్యక్షతన సమావేశం జరిగింది. అధికార పార్టీ ఎమ్మెల్యే కొందరు షర్మిల సమక్షంలో పార్టీలో జాయిన్ అవ్వనున్నారని ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ వైస్ ప్రెసిడెంట్ కొత్తూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

ఎన్నికల కోడ్ రాకముందే అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి సునీత అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆమె అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మూడు నెలల కాలంలో మండలంలో జరిగిన అభివృద్ధి పనులను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పటవల, తాళ్లరేవు, జి.వేమవరం, కోరంగి, పోలేకుర్రు, పంచాయతీల్లో సుమారు రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు సభ ఆమోదం తెలిపింది. డిసెంబరులో జరిగిన పంట నష్టానికి మండలం నుంచి 448 హెక్టార్లు, 963 మంది రైతులను గుర్తించామని తెలిపారు. పాత కోరంగిలో మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరంగి ఎంపిటిసి సభ్యులు రత్నకుమారి కోరారు. దళితులకు ప్రభుత్వం ఉచితంగా అందించే 200 యూనిట్ల విద్యుత్ సౌకర్యాన్ని పేద ప్రజలు ఉపయోగించుకునేలా విద్యుత్ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని ఇంజరం ఎంపిటిసి సభ్యులు కోరుకొండ కిరణ్మయి అధికారులను కోరారు.

జెఎఎస్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల వద్దకు వచ్చి అందిస్తున్న వైద్య సేవలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక గోలి వారి వీధిలోని సచివాలయంలో ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరం ద్వారా అవసరమైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా ఉచితంగా మందులు పంపిణీ కూడా చేస్తున్నారన్నారు. ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనూష, డాక్టర్ శిరీష, డాక్టర్ బివివిసిహెచ్ సత్యవాణి, డాక్టర్ పావని ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కరరావు, విడదాసరి రాజా, కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, అడ్మిన్ వెంకటరమణ పాల్గొన్నారు.

చిత్తడి నేలల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రకృతి విపత్తుల నుంచి సమాజాన్ని కాపాడటానికి చిత్తడి నేలలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ జీవవైవిద్య నిపుణుడు కోక మృత్యుం జయరావు పిలుపునిచ్చారు. మండలంలోని కోరంగి పర్యాటక కేంద్రంలో ఎపి నేషనల్ గ్రీన్ కోర్, ఎపి స్కూల్ ఎడ్యుకేషన్, అటవీశాఖ సంయుక్తంగా చిత్తడి నేలల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్తడి నేలల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపి గ్రీన్ కోర్ స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.గోవిందరావు, రీజనల్ కోఆర్డినేటర్ కేసరి శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్ కెవికె.మహేశ్వరరావు, అటవీ శాఖ అధికారి మహేష్, సిబ్బంది భైరవమూర్తి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

షర్మిల పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఈ నెల 25న ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఉమ్మిడి వెంకట్రావు పిలుపునిచ్చారు.

సాంకేతికతతో మంచి విద్య

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సాంకేతిక బోధన ద్వారా విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉంటుందని ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దనాపల్లి, సిరిపురం, లింగంపర్తి, తిరుమాలి, జె అన్నవరం పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్, డిజిటల్ ట్యాబ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి నీరుకొండ సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.